క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌కు నేడు ఆఖరు తేదీ



పమిడిముక్కల: అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ బుధవారంతో ముగుస్తుందని, ఏవైనా సమస్య లుంటే రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలని ఏఓ గణేష్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని హనుమంతపురం, ఐనంపూడి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పొలాలను సందర్శించి సూచనలు, సలహాలు అందజేశారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వినియోగించుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సునీల్ గవాస్కర్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు స్వామి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్. గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

అలీనఖీపాలెం రోడ్డును అభివృద్ధి చేసేదెప్పుడో?




పమిడిముక్కల: చోరగుడి నుంచి అలీనకీపాలెం వెళ్ల రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్ల లేచి ప్రమాదకరంగా ఉంది. అలీనఖీపాలెం వాసులు నిత్యం పనుల నిమిత్తం చోరగుడి వెళ్లాల్సి ఉంది. రోడ్డంతా అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చోరగుడి హైస్కూల్‌కు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు అదుపుతప్పి గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. తమ గ్రామం నుంచి అత్యధిక మంది తాపీ పనులకు వెళుతుంటారని, రోడ్డు సరిగా ఇబ్బందులు పడుతున్నామని ఎంపీటీసీ సభ్యుడు సజ్జాద్ అలీ తెలిపారు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అలీనఖీపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యాలయ మరమ్మతులకు భూమి పూజ



పామర్రు(మొవ్వ): పామర్రు మండల ప్రజా పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీఓ కే జ్యోతి తదితరులతో కలిసి ఆ భవన మరమ్మతు పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ విధులు రూ.25 లక్షలతో ఈ కార్యాలయం మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, పీఆర్ ఏఈ రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, హస్మతుల్లా పాల్గొన్నారు

పెనుమాకలంక–పెదయెడ్లగాడి రోడ్డును పరిశీలించిన ఆర్డీఓ



మండవల్లి: ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ మంగళవారం పెదయెడ్లగాడి–పెనుమాకలంక రోడ్డును సందర్శించారు. గ్రామస్తులు బయటకు రావడానికి ఏర్పాటు చేసిన పడవను పరిశీలించి, కొల్లేరు ముంపు పరిస్థితిపై తహసీల్దార్ కే గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పెదయెడ్లగాడి వద్ద గుర్రపుడెక్కను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. అత్యవసర పరిస్థితి వస్తేనే గ్రామం నుంచి బయటకు రావాలని తెలియజేయాలని ఆదేశించారు.

పెరుగుతున్న వరద ఉద్ధృతి

- జలదిగ్బంధంలో ఎడ్లంక
- వరద పెరిగితే పులిగడ్డ, దక్షిణ చిరువోలులంక గ్రామాలకు ముప్పు



పులిగడ్డ అక్విడెక్టును తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

అవనిగడ్డ: వరద ఉద్ధృతి పెరుగుతోంది. దీంతో దివిసీమలో ముంపు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక ఇప్పటికే జలదిగ్బంధంలో ఉండగా, వరద ఉద్ధృతి పెరిగితే మరికొన్ని గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది. కలెక్టర్ డీకే బాలాజీ నాగాయలంక మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు.

పడవ సాయంతో రాకపోకలు

అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక జలదిగ్బంధంలో ఉంది. గ్రామానికి వెళ్లే రహదారి వరదకు కొట్టుకుపోవడంతో గ్రామస్తులు పడవ సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇళ్ల సమీపంలోకి వరద ప్రవాహం రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద పెరిగితే మరికొన్ని గృహాలు కోతకు గురై నదిలో కలిసి పోతాయని బాధితులు వాపోతున్నారు. వరద మరింత అధికమైతే మండల పరిధిలోని పులిగడ్డ పల్లెపాలెం, వసుమట్ల, రేగుల్లంక, దక్షిణ చిరువోలులంక గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉంది.

అక్విడెక్టును తాకుతూ

ప్రకాశం బ్యారేజీ నుంచి 4.73లక్షల క్యూసెక్కులు వరదనీటిని దిగువకు వదిలారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెప్పారు. పులిగడ్డ వద్ద వరదనీరు అక్విడెక్టును తాకుతూ ప్రవహిస్తోంది. వరద ప్రవాహం మరో మూడగులు పెరిగితే అక్విడెక్టుపై నుంచి వెళ్లే అవకాశం ఉంది. అదే జరిగితే పంటకాలువలకు వరద నీరు పోటెత్తే ప్రమాదం ఉంది. వరద ప్రవాహం అధికం కావడంతో పులిగడ్డకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది.



సాగర సంగమ ప్రాంతంలో సముద్రంలో చేరుతున్న వరదనీరు

వాణిజ్య పంటలకు ముప్పే

చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోని లంకల్లో రైతులు అరటి, పసుపు, కంద, మిర్చితో పాటు పలు రకాల కూరగాయల తోటలను సాగుచేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ఇప్పటికే ఈ తోటలు ముంపునకు గురయ్యాయి. ఎనిమిది లక్షల క్యూసెక్కులకు వరద పెరిగితే ఈ తోటలను ముంచెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు మునిగితే తీవ్ర నష్టం చవి చూడాల్సి వస్తుందని చెప్పారు.

ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో దివిసీమలోని ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సిద్ధంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

జేసీ గీతాంజలిశర్మ



లంకపల్లిలో కృష్ణానది వరద ఉద్ధృతిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

పమిడిముక్కల: కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని జేసీ గీతాంజలిశర్మ అధికారులకు సూచించారు. మండలంలోని లంకపల్లి, ఐనపూరు రేవుల వద్దకు వెళ్లి వరద ఉద్ధృతిని పరిశీలించి, అధికారులతో జేసీ సమీక్షించారు. కృష్ణానదిలోకి పశువులు, ప్రజలు వెళ్లకుండా చూడాలని తెలిపారు. నదిలోకి వెళ్లే దారిని మూసివేసి రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచాలన్నారు. అనంతరం తోట్లవల్లూరు రేవును పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారేన్, పమిడిముక్కల, తోట్లవల్లూరు తహసీల్దార్‌లు నవీన్‌కుమార్, కుసుమకుమారి పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ ధీరజ్ వినీల్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక చవితి చలువ పందిళ్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్‌లోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, పామర్రు, పెదపారుపూడి, మొవ్వ, తోట్లవల్లూరు, పమిడిముక్కల, కూచిపూడి తదితర ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. మైక్‌లు, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకునే వారు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం విద్యుత్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి షార్ట్‌సర్క్యూట్‌లకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విభేదాలకు చోటు ఇవ్వకుండా సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు, మేళాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం సమయంలో మద్యం తాగకుండా, శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

పామర్రు(మొవ్వ): సమాజ శ్రేయస్సుకు పాటుపడటంలో పోలీసులు, జర్నలిస్టులు ఒకరు లేకుండా ఒ కరిని ఊహించుకోవడం కష్టతరం అని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. పామర్రులోని జరిగిన బోధిసత్వ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవంలో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజలకు మంచి చేయాలని, సమాజంలోని చెడుని బహిర్గతం చేయాలనే తలంపుతో ఉంటారన్నారు. మీడియా ద్వారా చెప్పే మంచి ప్రజల్లోకి నేరుగా వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పామర్రు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా విలేకరులు పనితీరును అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా విలేకరులను ఆయన సత్కరించారు. అదే విధంగా పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వి సుభాకర్, చిట్టిబాబు, పామర్రు, పెదపారుపూడి, మొవ్వ, తోట్లవల్లూరు ఎస్ఐలను ఫౌండేషన్ సభ్యులు, విలేకరులు సత్కరించారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



కైకలూరులో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



కలిదిండి మార్కెట్‌యార్డులో ఫొటోగ్రాఫర్లు

కైకలూరు/కలిదిండి: ఫొటోగ్రాఫర్లు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీనియర్ ఫొటోగ్రాఫర్లు సూచించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కైకలూరు రైల్వే స్టేషన్ రోడ్‌లో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీనివాసరావును పలువురు అభినందించారు. వెడ్డింగ్ ఫొటోగ్రఫీ, పర్సనలైజ్డ్ ఫొటో ప్రొడక్ట్స్, డ్రోన్ ఫొటోగ్రఫీ, ఏఐ టూల్స్, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యత సాధించి పోటీ తత్వాన్ని తట్టుకొని వృత్తిలో ముందుకు సాగాలని గౌరవాధ్యక్షుడు కె.శ్యామ్ సువర్ణరావు సూచించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు పంద్రెడ్డి నటరాజ్, నెంద్రు జాషువా, ఆచారి, సాగర్‌ను సన్మానించారు. ఫొటోగ్రాఫర్లు సుకుమార్, రాజేష్ ఖన్నా, కసగాల సుమంత్ బాలాజీ, పంద్రేడ్డి శివ, అయ్యప్ప, రామకృష్ణ, ఎడ్వర్డ్, మోషే, సురేష్ పాల్గొన్నారు.

కలిదిండిలో..

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ది కలిదిండి వీడియో గ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో సోమవారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నూకల శ్యామలరావు గుప్తా, సీనియర్ ఫొటోగ్రాఫర్లు విక్టర్, జోసెఫ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘ గౌరవాధ్యక్షుడు కె.విక్టర్, ఫొటోగ్రాఫర్లు ఎస్.వి.శ్రీనివాసరావు, త్రినాథ్, అయ్యన్న, ఇమ్మానుయేలు, భాను సాయి తేజ, డి.రాజు, దుర్గారావు, నరేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నగేష్‌ను సత్కరిస్తున్న ఎఫ్‌పీఎఫ్ సభ్యులు

ఫొటోగ్రాఫర్ నగేష్‌కు సత్కారం

గుడివాడ టౌన్: ఫొటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ గోకవరపు నగేష్‌ను సత్కరించారు. మంగళవారం స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని షాలిమార్ వీడియోస్ కార్యాలయంలో ఎఫ్‌పీఎఫ్ సభ్యులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఎఫ్ కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, జేసీసీక్లబ్ పూర్వ అధ్యక్షుడు తాడిపత్రి శ్రీనివాస్, ఎన్జీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ బాషా, వాసవీక్లబ్ జిల్లా సభ్యుడు గాదే మోహన్‌బాబు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

మొవ్వ: మొవ్వ న్యాయస్థానంలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికారిక సంస్థ చైర్మన్, జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసు కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క తెలిపారు. వివిధ కేసుల్లో కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులతో పాటు అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదుల ద్వారా సంప్రదింపులు నిర్వహించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రమాదకరంగా విద్యావనరుల కేంద్రం

మండవల్లి: మండల విద్యావనరుల కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా భవనంలోని మీటింగ్ హాల్లో మంగళవారం శ్లాబు కుంగి పెచ్చులూడిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు. శ్లాబు కుంగి పడిపోవడంతో ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వైర్లు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎటువంటి నష్టం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర నక్షత్ర అభిషేకాలు



పెడన: పట్టణంలోని శ్రీ వాసవీమాత క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని మంగళవారం సామూహిక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోట సతీష్ శర్మ వేద మంత్రాల మధ్య మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించగా 35 మంది దంపతులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న అధికారులకు సత్కారం



డీఎల్‌పీఓ సంపత్‌కుమారిని సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కోటయ్యను సత్కరించిన అధికారులు

గుడివాడరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న అధికారులను మంగళవారం సత్కరించారు. స్థానిక డీఎల్‌పీఓ కార్యాలయంలో గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి జి.సంపత్‌కుమారిని డివిజన్‌లో పంచాయతీ కార్యదర్శులు సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, జనార్ధనరావు, రామ్మోహనరావు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు వి.హరికృష్ణ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్, మల్లాయపాలెం పంచాయతీ సెక్రటరీ బి.కోటయ్యను మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీలు కె.అవ్వమ్మ, జనార్ధన్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజ



నాగాయలంక: శ్రావణ బహుళ ఏకాదశి, శ్రావణ మంగళవారం విశిష్టత పురస్కరించుకుని స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. వేద పండితుడు దీవి వేణుగోపాల్ బ్రహ్మత్వంలో 25మంది సామూహిక కుంకుమ పూజ జరిపారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

సబ్సిడీపై పశువుల దాణా విత్తనాలు



రైతులకు విత్తనాల బ్యాగులను అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి నరసింహులు

పెడన: పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా విత్తనాలను జిల్లా వ్యాప్తంగా అందజేస్తున్నామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎన్‌సీహెచ్ నరసింహులు అన్నారు. మంగళవారం ఆయన పెడన పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయాన్ని, ఆస్పత్రిని తనిఖీ చేశారు. పాడి రైతులకు దాణా పంపిణీ సమయంలో రావడంతో ఏడీ కొనకళ్ల బాబురావు జిల్లా అధికారితో పాడి రైతులకు సబ్సిడీపై దాణా విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలుగా 50 మెట్రిక్ టన్నుల విత్తనాలు వచ్చాయన్నారు. ప్రతి మండలానికి రెండు మెట్రిక్ టన్నులు చొప్పున అందజేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ప్రతిపాడి రైతుకు ఎకరం పొలంలో పశువుల దాణా పెంచుకోవడానికి కేజీ విత్తనాలు బయట మార్కెట్‌లో రూ.460 ఉందని, దీనిని రైతులకు రూ.345 సబ్సిడీ పోనూ రూ.115కు ఇస్తున్నట్లు వివరించారు. ఒక్కో రైతుకు పది కేజీల నుంచి 20 కేజీల వరకు ఇస్తారన్నారు. కార్యక్రమంలో పశువైద్యాస్పత్రి సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

• యాకమూరులో మిస్ వరల్డ్ సందడి



తోట్లవల్లూరు మండలంలోని యాకమూరులో మంగళవారం మిస్ వరల్డ్ ఓపెల్ సుచాత చౌంగ్‌శ్రీ సందడి చేశారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు పింక్ ఫర్ రన్ కార్యక్రమంలో పాల్గొని తిరిగివెళుతూ మార్గమధ్యంలో యాకమూరులో కొద్దిసేపు ఆమె ఆగారు. మేఘా ఇంజినీరింగ్ అధినేత కృష్ణారెడ్డి మామ బాపిరెడ్డి ఇంటికెళ్లి కృష్ణారెడ్డి, సుధ, కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్‌తో పలువురు సెల్ఫీలు దిగారు.

– పమిడిముక్కల

రైతుల సంక్షేమానికి కృషి చేయండి



సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: రైతుల సంక్షేమానికి పీఏసీఎస్‌ల చైర్మన్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మోటూరు, గుంటాకోడూరు గ్రామాల్లో జరిగిన పీఏసీఎస్ కమిటీల ప్రమాణస్వీకారోత్సవంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మోటూరు, గుంటాకోడూరు పీఏసీఎస్‌ల చైర్మన్‌లుగా చీకటి శేషగిరిరావు, మెరుగుమాల బసవ పూర్ణయ్య, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ నాయకుడు పిన్నమనేని పూర్ణవీరయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్‌యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్ పాల్గొన్నారు.

గుడివాడకు 11 బార్‌ల కేటాయింపు

ఎక్సైజ్ సీఐ వెంకటరమణ

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎక్సైజ్ బార్ పాలసీలో భాగంగా 2025–28 సంవత్సరాలకుగాను ఉత్వర్వులు జారీ చేసిందని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ మున్సిపాలిటీకి 11బార్‌లు కేటాయించారని తెలిపారు. వీటిలో ఒక బార్ కల్లుగీత కార్మికులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. బార్‌ల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో హైబ్రిడ్ మోడల్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు నాన్ రీఫండబుల్ రుసుం కింద రూ.5లక్షలు, అప్లికేషన్ ఫీజు కింద రూ.10వేలు చెల్లించాలన్నారు. ఒక బార్‌కు తప్పనిసరిగా నాలుగు అప్లికేషన్‌లు వస్తేనే డ్రా తీస్తామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైందని ఈ నెల 28 గురువారంతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్‌కు మాత్రం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 30వతేదీన డ్రా తీసి బార్‌లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ కోరారు.